క్లుప్తంగా

'గుడిబడి' విద్యార్థుల ప్రతిభ



కాశిబుగ్గ: వరంగల్ ఎన్‌సీసీ 10టీ కమాండెంట్ పరిధిలో నగరంలో శనివారం నిర్వహించిన కేడెట్ టాలెంట్ పోటీల్లో కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) కేడెట్లు ప్రతిభ కనబరిచారని హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రజ్వల ద్వితీయ బహుమతి, శ్రీవల్లి తృతీయ బహుమతి సాధించినట్లు ఆయన వివరించారు.

ఆ ఇద్దరు హెచ్‌ఎంలపై చర్య తీసుకోవాలి



విద్యారణ్యపురి: పాఠశాల విధులకు సెలవులు పెట్టి విదేశాలకు వెళ్లిన ఇద్దరు టీచర్లలో ఒకరికి నెల వేతనం, మరొకరికి 22రోజుల వేతనం బిల్లులు చేసిన రెండు ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు ఒక ప్రకటనలో కోరారు. ఈమేరకు హనుమకొండలోని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ కార్యాలయంలో ఏడీ రంగయ్యనాయుడుకు శనివారం ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఖిలా వరంగల్ మండలం కరీమాబాదు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఓ ఉపాధ్యాయురాలు, గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయురాలు సెలవులపై వెళ్లారని వివరించారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



హసన్‌పర్తి: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖ అధికారి గోపాల్ అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సునీత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, ఉద్యోగుల సంఘం హసన్‌పర్తి శాఖ అధ్యక్షుడు శీలం యాదగిరి పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో అన్నదానం



రామన్నపేట: వరంగల్ ఆటోనగర్‌లోని ఆదర్శ అంధుల పాఠశాలలోని విద్యార్థులకు శ్రీమాత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ముద్దసాని మల్లిక, ప్రధాన కార్యదర్శి నన్నపు సంజీవరావు, రాధిక, శ్రీనివాస్, గిరిజ, లక్ష్మి, నీలారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజుకు డాక్టరేట్



హన్మకొండ: హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజు బైరికి మైసూర్‌లోని జేఎస్ఎస్ యూనివర్సిటీ పీహెచ్‌డీ ప్రదానం చేసింది. జేఎస్ఎస్ ప్రొఫెసర్ ఆర్.వడివేలన్ పర్యవేక్షణలో ఎవాల్యుయేషన్ ఆఫ్ ఐసోఫ్లావోన్స్ ఫర్ కార్డియో ప్రొటెక్టివ్ యాక్టింగ్ టార్గెటింగ్ ఈస్ట్రోజెన్ రిసెప్టర్ అనే అంశంపై పరిశోధనకు రాజుకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు.

బీజేపీ అధికారంలోకి వస్తుంది



ఖిలా వరంగల్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ ధీమా వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ కరీమాబాద్ రోడ్డు బొమ్మగుడి సమీపంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మాచర్ల రవీందర్ ఆధ్వర్యంలో స్వశక్తి కరన్ అభియాన్ ఇన్‌చార్జ్ ఆడెపు వెంకటేష్ నేతృత్వంలో హర్ ఘర్ బీజేపీ, పోలింగ్ బూత్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాదాసు రాజు, ఎరుకల రఘునారెడ్డి, కునుకుంట్ల రంజిత్, బైరి మురళీకృష్ణ, గోనె రాజయ్య, కారంపూడి ఉమేష్, జక్కన్న, గోగికార్ అనిల్, రాజేందర్, నాగరాజు, శ్యామ్, అరుణ, చైతన్య, లావణ్య, శ్రీవాణి, మధు, శివప్రసాద్, బూత్ కమిటీ నేతలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కేడీసీలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



రోడ్డును శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ స్వరూపరాణి



కాజీపేట రూరల్: ఎలక్ట్రిక్ షెడ్‌లో స్వచ్ఛభారత్.

విద్యారణ్యపురి: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పలువురు సూచించారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాలలో తడి, పొడిచెత్త వేరు చేసి వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి అందజేశారు. కళాశాల ఆవరణాన్ని పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో కేడీసీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాంబాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ ఓంకార్, ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్లు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం బస్టాండ్ పరిసరాలను ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కేడెట్లు శుభ్రం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

హన్మకొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం హనుమకొండ టీవీటవర్ కాలనీ, కుడా కాలనీ శాంతి వనం పార్కులో, 60 ఫీట్ల రోడ్డులో ఎస్‌పీఆర్ స్కూల్, సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, శానిటరీ జవాన్లు విద్యాసాగర్, విజయ్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉర్సు రంగలీల మైదానంలో వాకర్స్

రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో స్వచ్ఛభారత్

కాజీపేట రూరల్: స్వచ్ఛ పక్షోత్సవంలో భాగంగా కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో మజ్దూర్ యూనియన్ నాయకులు స్వచ్ఛ రైల్, స్వచ్ఛభారత్ కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. రైల్వే మజ్దూర్ యూనియన్ ఈఎల్ఎస్ బ్రాంచీ నాయకులు షెడ్ ఆవరణంలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. బ్రాంచ్ సెక్రటరీ ఎన్.సదానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు ఎండీ.ఇబ్రహీం, సంపత్‌కుమార్, రాజు, సీసీఎస్ డెలిగేట్ శ్రీనివాస్, సునీల్, వెంకట్రావ్, అశోక్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

రంగలీల మైదానంలో చెత్త తొలగింపు

కరీమాబాద్: వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెత్తాచెదారాన్ని శనివారం తొలగించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మల అంబేడ్కర్, కే.రాజు, మోహన్, కుమార్, మల్లేశం, శ్రీను, లక్ష్మణ్, కిరణ్, రవియాదవ్, జవాన్లు సతీష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పేదలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

హన్మకొండ: పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను చీఫ్ విప్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 91 మంది లబ్ధిదారులకు రూ.94 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సుందర్‌రాజు యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వివిధ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న చీఫ్‌విప్

కాజీపేట అర్బన్: పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేట డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో, హంటర్‌రోడ్డులో సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను శనివారం చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పారంభించారు.

సరైన పోషణతోనే ఆరోగ్యవంతమైన సమాజం



ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్న బాలికలు

హన్మకొండ: సరైన పోషణతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి మధురిమ అన్నారు. పోషణ మాసం చివరి రోజు శనివారం హనుమకొండ సుబేదారిలోని తెలంగాణ అమరుల కీర్తి స్తూపం కూడలిలో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్లకార్డులు ప్రదర్శించి పోషణ మాసం ప్రాధాన్యం, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కాలేజీ ఎట్ హోం, రీచ్ బాలికల సంరక్షణ కేంద్రం బాలికలు.. పోషణ మాసం, ఓటు హక్కు వినియోగంపై ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్ ఆకట్టుకుంది. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హరిప్రసాద్ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. బాలల రక్షణ అధికారి ప్రవీణ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, డీ.రాజ్యలక్ష్మి, వనజ, కవిత, రమ, జ్యోతి, పోషణ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ ప్రీతి పాల్గొన్నారు.

పశువైద్యాధికారి తీరుపై రైతుల ఆగ్రహం



మాట్లాడుతున్న వెంకటనారాయణ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పశువైద్యాధికారి క్రాంతికుమార్ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్లవుతున్నా ఇప్పటి వరకు పశువులకు సంబంధించిన ఒక్క మందు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. గొర్రెల పథకం ఎంపిక కోసం మండల కేంద్రంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశువైద్యాధికారి వెంకటనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి వ్యవహరిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారి ప్రవర్తన సక్రమంగా లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం జిల్లా వైద్యాధికారి వెంకట నారాయణ మాట్లాడుతూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. కాగా, గొర్రెల పథకం ఎంపిక కోసం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. సమావేశంలో ఏడీఏ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ వినయ్, గొర్రెల పెంపకదారుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



వినతి పత్రాలు అందజేస్తున్న దడువాయి యూనియన్ నాయకులు

వరంగల్: రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న దడువాయిలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర దడవాయి యూనియన్ ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్‌లోని మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకుడు మల్లేషం, ఉప సంచాలకులు అజ్మీరా రాజునాయక్‌కు శనివారం వినతి పత్రాలు అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పని కృష్ణ, కోశాధికారి సురేందర్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, రాఘవులు, రాకేష్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి విమర్శించారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని డీఈఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ప్రస్తుతం పొందుతున్న వేతనానికి అదనంగా మరో రూ.2 వేలు అదనంగా ఇవ్వనున్నట్లు 2022, మార్చి 13న అసెంబ్లీలో సీఎం ప్రకటన చేశారని గుర్తుచేశారు. ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని వాపోయారు. ధర్నాలో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు రాలు శాంత, పద్మ, ఫర్వీన్, ప్రేమలత, సంధ్య, కొమురయ్య, కిరిట సరిత, కొమురమ్మ, సునీత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో స్టాండింగ్ కమిటీ సమావేశాలు



సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు

వరంగల్: జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు సాదాసీదాగా జరిగాయి. జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశాలకు జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరు కాలేదు. గీసుకొండ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు అధ్యక్షతన 1వ స్థాయీ సంఘం, 2వ స్థాయీ సంఘం సమావేశం వాయిదా పడింది. జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ అధ్యక్షతన 3వ స్థాయీ సంఘం, 4వ స్థాయీ సంఘం సమావేశం వాయిదా పడింది. నడికూడ జెడ్పీటీసీ కోడెపాక సుమలత అధ్యక్షతన 5వ స్థాయీ సంఘం, నెక్కొండ జెడ్పీటీసీ లావుడ్య సరోజన అధ్యక్షతన 6వ స్థాయీ సంఘం, సంగెం జెడ్పీటీసీ గూడ సుదర్శన్ అధ్యక్షతన 7వ స్థాయీ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ అభివృద్ధి, జిల్లా ప్రణాళిక, బడ్జెట్ పన్ను విధింపు, మైన్స్, పౌరసరఫరాలు, ఆర్థిక విషయాలు, వ్యవసాయం, పశుసంవర్ధక, భూమి సాగు యోగ్యం, వాలు గట్లు వేయుట, అడవుల పెంపకం, మత్స్య పరిశ్రమ, మార్కెటింగ్, పట్టు పరిశ్రమశాఖలు, స్త్రీ సంక్షేమం, మహిళల అభివృద్ధి, పిల్లల సంక్షేమం, అనుసూచిత కులాలు, వెనుకబడిన వర్గాలు, అల్ప సంఖ్యాక వర్గాలు, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, ఎస్సారెస్పీ, దేవాదుల, జాతీయ రహదారులు, విద్య, మౌలిక వసతుల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాలపై సమీక్షించారు.

పేదలకు ఆరు పథకాలు అందజేస్తాం



మామునూరు: మాట్లాడుతున్న శ్రీనివాస్

మామునూరు: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ తెలిపారు. ఖిలా వరంగల్ మండలం మామునూరులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డెపల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో గడపగడపకు 6 గ్యారంటీ పథకాలపై శనివారం ప్రచారం నిర్వహించారు.

కాకతీయ కాలనీలో కాంగ్రెస్ ప్రచారం

హన్మకొండ: జిల్లా కాంగ్రెస్ యువజన ప్రధాన కార్యదర్శి బీమా వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో 4వ డివిజన్ పరిధిలోని కాకతీయకాలనీ, పెద్దమ్మగడ్డ ప్రాంతాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. ప్రచారంలో నాయకులు వడ్డెపల్లి రమేష్, అనిల్, నిశాంత్, సురేష్, శ్రీను, అజయ్, అర్జున్, గౌతమ్, ఐలన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

చెక్కు అందజేత

వరంగల్ క్రైం: ఆకస్మికంగా మృతి చెందిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబానికి మంజురైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ శనివారం అందజేశారు. సివిల్ కానిస్టేబుల్ కె.క్రాంతికుమార్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ.. మే 5న మరణించారు. తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మంజురైన రూ.7.84 లక్షల చెక్కును కానిస్టేబుల్ భార్యకు వరంగల్ పోలీస్ కమిషనర్ అందజేశారు.

ప్రతిమకు అభినందన

హన్మకొండ: నగరంలోని రామన్నపేటకు చెందిన ప్రతిమకు ఈనెల 2న నూతన పార్లమెంట్ భవనంలో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రావడం గర్వించదగ్గ విషయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ అన్నారు. ఈసందర్భంగా హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో ప్రతిమకు పుస్తకాలను అందించి అభినందించారు.

నూతన కమిటీ ఏర్పాటు

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా రంగస్థల పద్య నాటక కళా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఉదయం వరంగల్ పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో నిర్వహించారు. పరిషత్ అధ్యక్షుడు మారేడోజు సదానందచారి అధ్యక్షత వహించిన ఈసమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండాప్రకాశ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దండు సారంగపాణి, పద్యనాటక కళాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు

హన్మకొండ: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 2 వరకు 67వ ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 బాలుర రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ జరగనుంది. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు కోచ్ రాంప్రసాద్‌తో కలిసి శనివారం వెళ్లింది. టోర్నీలో పాల్గొనే క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 జిల్లా కార్యదర్శి డాక్టర్ బరుపాటి గోపీ వెల్లడించారు.

గౌడ గర్జనతో రాజకీయ పార్టీలకు భయం

హన్మకొండ: గౌడ గర్జనతో రాజకీయ పార్టీలకు భయం పుట్టాలని గౌడ్ సంఘాల జేఏసీ చైర్మన్ బైరి రవికృష్ణ గౌడ్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించనున్న గౌడ గర్జన సభ ఏర్పాట్లను జేఏసీ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ గర్జన బహిరంగ సభ ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ఖిలా వరంగల్: శంభునిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ -2023 ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ -14, అండర్ -17, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక క్రీడాపోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై కార్పొరేటర్ పోశాల పద్మతో కలిసి వాలీబాల్, ఖోఖో క్రీడాపోటీలను ప్రారంభించారు. ఎంఈఓ విజయ్‌కుమార్, హెచ్‌ఎంలు శారదాబాయి, పుసారాం, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, రవీందర్, హైమత్‌ఖాన్ పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో హరిణికి 57వ ర్యాంకు

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన ఆరె హరిణి.. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి పీజీ ప్రవేశ పరీక్ష (మైక్రో బయాలజీ విభాగం)లో 57వ ర్యాంకు సాధించింది. వరంగల్ పద్మావతి మహిళా కళాశాలలో హరిణి డిగ్రీ పూర్తిచేసి, పీజీ ప్రవేశ పరీక్ష రాసి మంచి ర్యాంకు సాధించింది. శుక్రవారం ఓయూలోని ఎమ్మెస్సీ జెనెటిక్స్‌లో ఓపెన్ కేటగిరీలో సీటు సాధించింది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కాజీపేట: తాళం వేసిన ఇంట్లో శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి బంగారంతో పాటు విలువైన వస్తువులను అపహరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట 63వ డివిజన్ విష్ణుపురిలో కొక్కొండ సాంబమూర్తి అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి శుక్రవారం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. శనివారం ఉదయం బట్టలు పిండటం కోసం పని మనిషి ఇంటికి రాగా తాళం తీసి ఉండటంతో అనుమానం వచ్చి సాంబమూర్తికి ఫోన్ చేసి విషయం తెలిపింది. సాంబమూర్తి ఇంటికి చేరుకుని బీరువా చూడగా 10 తులాల బంగారం, విలువైన వస్తువులు పోయినట్లు గుర్తించారు. అనంతరం బాధితుడు కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ సార్ల రాజుతో పాటు క్లూస్ టీం సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

బైక్ రేసర్ల హల్‌చల్

కాజీపేట: మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం నిట్ ప్రధాన రహదారిని కొంత మంది యువకులు బ్లాక్ చేసి ద్విచక్ర వాహనాలతో రేసింగ్‌కు పాల్పడి హల్‌చల్ సృష్టించారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. దాంతో వీడియోల ఆధారంగా బైక్ రేసింగ్‌కు పాల్పడిన యువకులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. సుమారు 50 మందికి పైగా యువకులు బైక్ రేసింగ్‌కు పాల్పడినట్లుగా తెలుస్తోంది. కొంతమంది యువకులను శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పేర్లు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

నేటి వైశ్య గర్జనను విజయవంతం చేయండి

నయీంనగర్: వైశ్యుల న్యాయమైన 10 డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహిస్తున్న వైశ్య గర్జనను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఆర్య వైశ్య చైతన్య పోరాట సమితి అధ్యక్షుడు గుండా ప్రభాకర్ గుప్తా పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పూర్ణ సంతోష్, రమేష్, పూర్ణచందర్ రావు పాల్గొన్నారు.

రేపు హసన్‌పర్తిలో రక్తదాన శిబిరం

ఎంజీఎం: ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2వ తేదీన హసన్‌పర్తి ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తెలిపారు. 18నుంచి 50ఏళ్ల లోపు 45కిలోల బరువు ఉన్న వారు రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.

అటానమస్ కళాశాలగా వాగ్దేవి ఫార్మసీ

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాల అటానమస్‌గా గుర్తిస్తూ న్యూఢిల్లీలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీన్ ప్రొఫెసర్ ఎన్ఎస్ వీఎన్ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అటానమస్ గుర్తింపునకు విశేష కృషి చేసిన కళాశాల సెక్రటరీ సీహెచ్.దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ వాహిణిదేవికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

వీరుల త్యాగాలను స్మరించుకుందాం

ఖిలా వరంగల్: భారత స్వాతంత్రోద్యమంలో ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగాలను స్మరించుకోవడం తామందరి బాధ్యత అని వరంగల్ డివిజన్, జిల్లా తపాలా పర్యవేక్షకులు ఎం.నరసింహస్వామి అన్నారు. మేరీ మిట్టి.. మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోట శిల్పాల ప్రాంగణంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సహకారంతో అమర వీరుల త్యాగాలను శనివారం గుర్తుచేసుకున్నారు.

పాలమూరు – రంగారెడ్డికి నిధులు ఇవ్వాలి

హన్మకొండ: పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు డిమాండ్ చేశారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడానికి రూ.60 వేల కోట్లు అవసరమని తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈమేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఏసీపీ అరెస్టులో జాప్యం తగదు

హసన్‌పర్తి: చీటింగ్ కేసులో ఏసీపీ మదన్‌లాల్‌కు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసినప్పటికీ పోలీసులు అరెస్టు చేయడంలో జాప్యం చేస్తున్నారని బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భీమారంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని ఏసీపీ మదన్‌లాల్‌ను అడగగా, ప్రస్తుతం కేసు కోర్టులో ఉందని చెప్పారు.

జీఓ 142ను వెంటనే రద్దు చేయండి

నయీంనగర్: ప్రాథమిక ఆరోగ్య రంగాన్ని పటిష్టపరిచేందుకు మానవ వనరులను హేతుబద్ధీకరించేందుకు విడుదల చేసిన జీఓ నంబర్ 142 లోపభూయిష్టంగా ఉందని, దాన్ని రద్దు చేయాలని 142 జీఓ రద్దు కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డీడీఎంహెచ్‌ఓ యాకూబ్ పాషా మాట్లాడుతూ ఆ జీఓను రద్దు చేయకపోతే 10న రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

కాశిబుగ్గ: ఈనెల 6న రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు నగర పర్యటనను విజయవంతం చేయాలని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పిలుపునిచ్చారు. ఓ సిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యలయంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

నయీంనగర్: విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ ఎం.భోగరాజు, హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతరెడ్డి సూచించారు. హనుమకొండ వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో వరంగల్ ట్రాఫిక్ పోలీస్, ఆదర్శ మారుతి డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాజీపేట్ సీఐలు వెంకన్న, సుజాత, డ్రైవింగ్ స్కూల్ మేనేజర్ జన్ను శ్యామ్, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్ రెడ్డి, ఫ్యాకల్టీ, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

హసన్‌పర్తి: మొక్కల పెంపకం సాంకేతిక యువత సామాజిక బాధ్యత అని ఐఐటీ ముంబాయి రిటైర్డ్ ప్రొఫెసర్ నారాయణ్ ఖేద్కర్ అన్నారు. నగరంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హరితహార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ పీ.రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ రాజగోపాల్, డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

'చలో మత్స్య భవన్' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

హన్మకొండ: మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.ఐదు వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇస్తూ రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించాలనే డిమాండ్‌తో ఈనెల 3వ తేదీన చలో మత్స్యభవన్ కార్యక్రమం తలపెట్టినట్లు తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ తెలిపారు. ఈమేరకు హనుమకొండ కుమార్‌పల్లిలోని చేపల మార్కెట్ వద్ద చలో మత్స్య భవన్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్ర

హసన్‌పర్తి: రాజ్యాంగాన్ని మార్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం దళిత సమ్మేళనం నిర్వహించారు. డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్ట సాధనకు సామాజిక న్యాయం, రిజర్వేషన్ల అమలుకు ఈనెల 4న నిర్వహించనున్న చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆశ కార్యకర్తల మానవహారం

హన్మకొండ: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు శనివారం మానవహారం నిర్వహించారు. ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఆశ వర్కర్లు హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు నుంచి కాళోజీ విగ్రహం వరకు ర్యాలీగా చేరుకుని మానవహారం నిర్వహించారు. ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీవాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ యాకూబీ, యూనియన్ నాయకులు ఎస్.రమ, స్వప్న, శారద, ఎల్లమ్మ పాల్గొన్నారు.

కేయూ వీసీ, రిజిస్ట్రార్‌ను బర్తరఫ్ చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని కోరిన విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులతో దాడులు చేయించిన కేయూ వీసీ రమేష్, రిజిస్ట్రార్ శ్రీనివాసరావును బర్తరఫ్ చేయాలని బహుజన సమాజ్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద శ్యామ్ డిమాండ్ చేశారు. కేయూలో దూర విద్యాకేంద్రం ఆవరణలో కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ దీక్షలను శనివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. అలాగే, దీక్షకు ఓయూ జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ రుద్రారపు లింగస్వామి, నాయకులు గాదె వెంకట్, బద్రీ, నగేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల బైక్ ర్యాలీ

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని జేఏసీ బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు కాంట్రాక్టు లెక్చరర్లు విధులు బహిష్కరించి కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో కేయూ నుంచి హనుమకొండలోని అమరవీరుల స్తూపం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేసి కలెక్టరేట్ ఎదురుగా ఉన్న అమర వీరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు.

కేయూ క్యాంపస్: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్న కాంట్రాక్టు టీచర్స్ జేఏసీ దీక్షలు శనివారం 5వ రోజుకు చేరుకున్నాయి.